వక్ఫ్‌బోర్డు ఆంక్షలు ఎత్తివేయాలని వినతి



సబ్‌రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

ఘట్‌కేసర్: వక్ఫ్ బోర్డు రికార్డులో ఉన్న స్థలాలపై ఆంక్షలు ఎత్తివేయాలని బీజేపీ నేతలు సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని పేదలు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకోవడానికి వక్ఫ్ బోర్డు ఆంక్షలు ఎత్తివేసి అనుమతి ఇవ్వాలని లేఖలో కోరారు. బీజేపీ నేతలు మహిపాల్‌రెడ్డి, రామోజీ, బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు అనిల్‌గౌడ్, రాధిక, మమతశర్మ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్



జూనియర్ కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్‌లో పట్టణ బీజేపీ నాయకులు శ్రమదానం చేసి జూనియర్ కళాశాల ఆవరణ, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేశారు. సోమవారం ఉదయం బీజేపీ నాయకులు ఆసుపత్రి ఆవరణకు చేరుకుని చీపుర్లు చేతబట్టి ఆవరణను శుభ్రం చేశారు. గంటల తరబడి శ్రమించి జూనియర్ కళాశాల ఆవరణ, ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేశారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, వంశీవంజరి, అర్జున్, ప్రేమ్‌దాస్, వంశీధర్‌రెడ్డి, హేమలతారెడ్డి తదితరులున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం



అరుంధతి ప్రిన్సిపాల్

మేడ్చల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు మే13న నిర్వహించే పాలిసెట్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి అన్నారు. మేడ్చల్ కళాశాలలో 180 సీట్లు ఉన్నాయని, పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకునేందుకు అర్హులని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. డిప్లొమా మెకానికల్ ఇంజినీరింగ్‌లో 60 సీట్లు, డిప్లొమా ఎలక్ట్రికల్‌లో 60 సీట్లు, డిప్లొమా ఈసీఈలో 60 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 19వ తేదీలోగా పాలిసెట్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250, ఇతరులకు రూ.500 ఉంటుందని పేర్కొన్నారు.

క్రికెట్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం



ఘట్‌కేసర్: మాదారంలో నిర్వహించిన మాదారం క్రికెట్ లీగ్ (ఎంపీఎల్) సీజన్-6 ముగిసింది. సోమవారం విజేతలకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ పరుశురాం ముఖ్యఅతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. మాజీ కౌన్సిలర్ మల్లేష్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రవి, ఎస్సై శేఖర్, జంగయ్యయాదవ్, మధు, సుదర్శన్, మల్లయ్య, జంగయ్య, స్థానికులు, పోలీసులు పాల్గొన్నారు.

రూ. 1.70 కోట్లతో అభివృద్ధి పనులు



మౌలాలి: నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌తో కలిసి రూ.1.70 కోట్ల నిధులు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హనుమాన్‌నగర్ నుంచి బండచెరువు వరకు బాక్స్ డ్రైయిన్ నిర్మించనున్నట్లు చెప్పారు. ఈఈ మాధవిలత, బీజేపీ నేతలు గున్నాల చంద్రశేఖర్, మౌలాలి డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, లింగారావు, శ్రీనివాస్, నటరాజ్, ఖుద్దూస్, వంశీరెడ్డి తదితరులున్నారు.

ప్రజావాణిలో 82 ఫిర్యాదులు !

- ఆక్రమణలు, సంక్షేమ పథకాలపై దరఖాస్తులు
- వేతనాలపై పంచాయతీ కార్మికులు
- సర్వే చేసిన డబ్బుల కోసం సిబ్బంది మొర



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి 82 ఫిర్యాదులను అందజేశారు.

- వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.
- భూకబ్జాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై 23 ఫిర్యాదులు రాగా.. అక్రమ భవన నిర్మాణాలు, అనుమతి లేకుండా బహుళ అంతస్తుల కట్టడాలపై అత్యధికంగా 34 ఫిర్యాదులు వచ్చాయి.
- నాగారం, దమ్మాయిగూడ, ఫీర్జాదిగూడ, పోచారం, మేడ్చల్, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, కొంపెల్లి, తూముకుంట పురపాలక సంఘాలతో పాటు ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించిన వాటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి.
- ఇరిగేషన్‌పై ఐదు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు సంబంధించి 4 ఫిర్యాదులు, హౌసింగ్, పంచాయతీ, మల్కాజిగిరి, కీసర ఆర్డీఓలు, మెప్మా, విద్య, పోలీసుశాఖలకు సంబంధించినవి కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదులు అందజేశారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌డీఏ సాంబశివరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి..

వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలి. వినతులపై చేపట్టిన చర్యలను ప్రజలకు వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలి.

– విజయేందర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్

ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మేడ్చల్: ఆటో డ్రైవర్లు ఆటోలు నడిపించే సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. సోమవారం పట్టణంలోని వివిధ ఆటోస్టాండ్‌లలో పోలీసులు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించి స్టిక్కర్లు అంటించారు. మద్యం సేవించి, లైసెన్సులు లేకుండా, యూనిఫామ్‌లు లేకుండా ఆటోలు నడపొద్దని సూచించారు. ప్రతి ఆటో డ్రైవర్ పూర్తి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటోలను నడపాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై ఆటోలు నడిపితే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్సై పరశురాం, ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు విజయారావు, డ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసులు తదితరులున్నారు.

పార్కింగ్ గొడవలో మృతిచెందిన వ్యక్తి కేసులో..

ఇద్దరు నిందితుల రిమాండ్

పోచారం: బైక్ పార్కింగ్ విషయంలో తలెత్తిన గొడవ కాస్తా ఒకరి మృతికి కారణమైంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందడంతో నిందితులను పోచారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. వెంకటాపూర్‌లోని డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో సుందిరి శంకర్ (34) నివాసం ఉంటున్నాడు. ఈనెల 1న అర్ధరాత్రి బైక్ పార్కింగ్ విషయంలో నవీన్, నీల వెంకటేష్ గొడవ పడుతున్నారు. నవీన్‌తో ఎందుకు గొడవపడుతున్నావని వెంకటేష్‌ను శంకర్ ప్రశ్నించడంతో గొడవకు దారితీసింది. ఈ గొడవలో వెంకటేష్, నేలు శన్నమ్మ, అరుణలు రాళ్లు, బ్యాటరీ లైటుతో శంకర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు ఈనెల 5న మృతి చెందాడు. మృతుడి తల్లి అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు నీల వెంకటేశ్ (19), నేలు శన్నమ్మ (41)లను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



అల్వాల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: అల్వాల్‌కు చెందిన దివంగత గణేష్‌గౌడ్ జ్ఞాపకార్థం సాయిరామ్‌గౌడ్ ఆధ్వర్యంలో అల్వాల్ ఇందిరాగాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు అశోక్, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, ఉదయ్, లక్ష్మీకాంత్, మహిళా నాయకురాళ్లు, స్థానిక నేతలు తదితరులున్నారు.

మల్లాపూర్: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మల్లాపూర్ నాగలక్ష్మినగర్ మెయిన్‌రోడ్డులో కాంగ్రెస్ సీనియర్ నేత కొయలకొండ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా ఎస్సీసెల్ సలహాదారులు పీజీ.సుదర్శన్, మల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బండి సంపత్‌గౌడ్, రాహుల్, మైథిలి, సాయితేజ, నవీన్, సాయిరామ్‌గౌడ్, సాయిరెడ్డి, సూరజ్, అజామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మేడిపల్లిలో సోమవారం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. మానవాళికి ఏకైక ఆదర్శం హనుమంతుడని, ఆయన స్థిరత్వానికి ప్రతీకని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో హనుమంతుడి జీవితాన్ని ప్రేరణగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రాముయాదవ్ తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరోగ్య దినోత్సవం

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఆరోగ్యంపై వ్యయాలు రోజు రోజుకు పెరిగి పెను భారమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైస్ ప్రిన్సిపాల్ చెప్పారు. నిత్యం యోగా, నడక వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. కో- ఆర్డినేటర్ గీత, డా.తిరుపతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 11కేవీ మైసమ్మగూడ ఫీడర్ విభజనలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ప్రకటించారు.

ఘనంగా మల్లన్న కల్యాణం

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో మల్లన్న కల్యాణం ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ కౌన్సిలర్ వెంకటేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, వేమన రెడ్డి, గణేష్‌యాదవ్, బాలకృష్ణ, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

మల్కాజిగిరి: కృష్ణవేణి పాఠశాల వార్షికోత్సవం శ్రీదేవి ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. గతేడాదిలో పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చైర్మన్ సంగాని రాజు, జోనల్ చైర్మన్ బుచ్చిరెడ్డి, డైరెక్టర్ మంచాల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ హారిక తదితరులున్నారు.

హనుమయ్యకు ఉగాది పురస్కారం

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు హనుమయ్యను సంగమం (కళావేదిక) ఉగాది పురస్కారం లభించింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాల ఎంపిక కమిటీ చైర్మన్ హర్షవర్ధన్, ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, ప్రముఖ నటి విజయ హనుమయ్యను సత్కరించి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హనుమయ్య ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పన, ఎస్‌సీసీ ద్వారా విద్యార్థులను జాతీయస్థాయిలో గుర్తింపు రావడానికి కృషి చేయడంతో పాటు తన సొంత నిధులతో సొంత గ్రామంలో లైబ్రరీ నిర్మించారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి వార్షికోత్సవ వేడుకలు



గౌతంనగర్: డివిజన్ పరిధి వాణినగర్‌లోని విజయ వినాయక ఆలయంలో దత్తాత్రేయస్వామివారి 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి 108 లీటర్ల పాలతో భక్తులు స్వామివారికి సామూహికంగా అభిషేకం, విశేష పూల అలంకరణ, అర్చనలు, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, భిక్ష సమర్పణ, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ అనంతరం సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సిరిగిరి రాజు, సభ్యులు జీనయ్య, బలరాం, వీరభద్రరావు, పార్థు, సురేష్‌సింగ్, సంజయ్, శ్రీకాంత్, రాము, నరేష్ తదితరులున్నారు.

ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లకుండా చర్యలు



మేడ్చల్‌లో జాతీయ రహదారిపై విస్తరణ పనులు

మేడ్చల్: 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మేడ్చల్ పట్టణంలో ప్రజలు అధికంగా ఆస్తులు నష్టపోకుండా అధికారులు రోడ్డును 75 అడుగుల లోపు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో 72 పిల్లర్లు ఏర్పాటు చేసి, మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి ఐటీఐ వరకు ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. ఫ్లై ఓవర్ కింద రోడ్డును నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు 4 లైన్లు ఉండగా.. ఫ్లై ఓవర్ నిర్మాణంతో రోడ్డు విస్తరణ మారనుంది. అంబేడ్కర్ విగ్రహం నుంచి ఐటీఐ వరకు రోడ్డుకు ఇరువైపులా శాశ్వత కట్టడాలు ఉండగా.. భూ సేకరణ, నష్టపరిహారం చెల్లింపులు అధికం కానుండటంతో అధికారులు మేడ్చల్‌లో జాతీయ రహదారి విస్తరణ 75 అడుగుల మేర వేయనున్నారు. 75 అడుగుల లోపు విస్తరరించడంతో శాశ్వత భవనాలకు ఎక్కువగా నష్టం లేకపోతుండటంతో అధికారులు విస్తరణ పనులు ముమ్మరం చేయనున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం..

మేడ్చల్ పట్టణ పరిధిలో జాతీయ రహదారి విస్తరణ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న వారికి నోటీసులు జారీ చేశాం. వారి ఆస్తులకు సంబంధించిన పత్రాలు సమర్పించాలని కోరాం. పత్రాలు సమర్పించిన వారి ఆస్తులను పరిశీలించి ఎంత మేర నష్టం వాటిల్లుతుందనే విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

– నాగిరెడ్డి, కమిషనర్

గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన



మజీద్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట వంటవార్పు

శామీర్‌పేట్: బకాయి వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం శామీర్‌పేట మండలం, మజీద్‌పూర్ గ్రామపంచాయతీ కార్మికులు కార్యాలయం ఎదుట వంటవార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 5 నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇంట్లో పూట గడవని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న 5 నెలల జీతాలను వెంటనే చెల్లించాలి డిమాండ్ చేశారు. కార్మికులు పోచయ్య, కృష్ణ, శంకరయ్య, అర్జున్, కవిత, నర్సమ్మ, లక్ష్మి, అనసూయ, సబిత, ప్రవళిక తదితరులున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ప్లీనరీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ శాంతి

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 21న జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డిల చేతులమీదుగా విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి, ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండస్వామి, అధికార ప్రతినిధి గగన్‌కుమార్, ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దయానంద్, భాస్కర్, శివకుమార్, సత్యనారాయణ, శోభన్‌బాబు, ముత్యాలు, మల్లేష్‌చారి, సుధీర్, సతీష్, వెంకటేష్, సరిత, రమేష్, ఆంజనేయులు, గణేష్, శ్యామ్‌కుమార్, రమేష్‌చారి తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ వేడుకలు



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నేతలు

మల్లాపూర్: దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నాచారం అన్నపూర్ణ కాలనీ అంబేడ్కర్ కమ్యూనిటీహాల్ వద్ద డీఎస్ జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ హాజరై మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నెల రోజుల పాటు జిల్లా అంతటా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాచారం దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ, సంజన్న, అంజి మాదిగ, నల్లబాబు, దేవులపల్లి యాదగిరి, సంతోష్, శివ, రమేష్, రాంచందర్, వెంకటేష్, ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

ప్రేమించిన అమ్మాయితో పెళ్లికి నిరాకరించారని..

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి



సాయిపవన్ (ఫైల్)

జవహర్‌నగర్/మేడిపల్లి: ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కాలేదని ఓ యువకుడు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గత నెల మార్చి 28న పెళ్లి విషయంలో ఇంట్లో గొడవపెట్టుకుని సాయిపవన్ (28) అనే యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. జవహర్‌నగర్‌కు చెందిన సాయిపవన్ మేడిపల్లిలో నివాసం ఉంటున్న ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఈ క్రమంలో మార్చి 30న యువతి నివాసానికి వెళ్లి ఆ అమ్మాయితోనే వివాహం జరిపించాలని ఆమె ఇంటిఎదుట తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను మీద పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడి మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తులో ఉంది.

సఫిల్‌గూడ చెరువు అభివృద్ధికి చర్యలు

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎస్టీపీ ప్లాంట్, చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.83 లక్షలతో చెరువులో ఏడాది పాటు గుర్రపుడెక్క తొలగింపు పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. చెరువుకు కొంత భాగంలోనే వాకింగ్‌ట్రాక్ ఉందని, దానిని చెరువు చుట్టూ ఉండేలా చూడటంతో పాటు ఫెన్సింగ్ పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. చెరువులోకి మురుగు వదలకుండా ప్రజలు సహకరించాలన్నారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, డీఈ మహేష్, ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలొద్దు..

మల్కాజిగిరిలోని బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేయడమే కాకుండా ఎమ్మెల్యేను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. ఎమ్మెల్యే పేరున జీహెచ్ఎంసీ అధికారులకు పలు అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ నాయకులు లేఖ అందజేశారన్నారు. గత నెలలోనే అభివృద్ధి పనులపై అధికారులతో కలిసి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నిధులు మంజూరైతే వారే చేయించామని గొప్పలు చెప్పుకోవడానికి చూస్తున్నారని, ఎమ్మెల్యే స్పందిస్తే ముఖాముఖి చర్చకు తాను సిద్ధమేనని స్పష్టం చేశారు.